# పాలరాతి ఊయల!

పాలరాతి ఊయల!

పచ్చని ఆకులతో, లతలతో, గులాబీరంగు పూలతో, అందాల చెక్కడం పనితో, మనస్సుని దోచుకొనే మనోహరమైన చిన్నజాబిల్లి లాంటి తెల్లని ఊయల!

పాలరాతి ఊయల!

అపర్ణ మనస్సులో ఊగుతూనే ఉంది.

అసలు ఎప్పుడు ఆగింది కనక?

చల్లగా మెల్లగా మత్తుగా మెత్తగా.

అపర్ణ ఆలోచనల్ని సుతారంగా గాలిలోకి విసురుతూ, మనస్సుని ఊహా లోకాల్లోకి తీసికెళుతూ, అటు ఒంగుతూ, ఇటు ఒరుగుతూ – ఊగుతూనే ఉంది.

పదమూడేళ్ళ అందాల బొమ్మ అపర్ణకి, ఇరవైయేళ్ళ సుబ్బారాయుడుతో, పెద్దలు పెళ్ళి నిశ్చయించేసినప్పుడు, హాయిగా తన మనస్సులో ఊగుతూన్న ఆ వెన్నెల ఊయల్ని, ఒక్కసారిగా మొరటుగా ఎవరో గుంజేసినట్లు అనిపించి, అపర్ణ రెండు కళ్ళూ రెండు వేడి కన్నీటి కణాల్ని రాల్చాయి. సుబ్బారాయుడు తన మెళ్ళో తాళి కడుతూన్నప్పుడూ అంతే!

పాలరాతి ఊయల మీంచి ఒక్క ఉదుటున తనని కిందకి పడదోసినట్లు, భయంతో కెవ్వున అరిచింది మౌనంగా.

అత్తారింటికి ఎడ్లబండిమీద కాపురానికి వెళ్తూన్నప్పుడు, చక్రాలు గులకరాళ్ళ మీద దొర్లుతూ కరకరమని కర్కశంగా చప్పుడు చేస్తూంటే అపర్ణ గుండెల్లోని వెండి

గొలుసుల ఊయల, సన్నని ధ్వనితో ఊగుతూ, తనకి అందని ఎత్తులకి వెళ్ళిపోతున్నట్లు అనిపించి, బేలగా నిస్సహాయంగా అటూ యిటూ చూసింది పంటకోసేసి బోసిగా ఉన్న చేలకేసీ, ఆకులన్నీ రాల్చేసి మోళ్ళుగా నిలబడ్డ చెట్లకేసీను.

అత్తారింటికి చేరిన రోజున, రాత్రి రాత్రంతా మోకాళ్ళమీద తలపెట్టుకుని కన్నీళ్ళు కారుస్తూనే ఉంది. ఎంత ఎత్తుకి జాపినా చేతులకి అందకుండా, అంత ఎత్తులో ఊగుతూన్న పాలరాతి ఊయల్ని అందుకోలేక, నిస్సహాయంగా నిట్టూరుస్తూ.

"మాట్లాడవేం? ఎన్నిమాట్లు పిలవాలి? ఏవిటాపరధ్యానం!"

అంటూ సుబ్బారాయుడు గట్టిగా అరిచినప్పుడు, లేత తామలపాకు తీగెలా, వణికిపోయింది.

"మా అమ్మ పెద్దదైంది. కోడలు వచ్చాక కూడా చాకిరీయేనా? ఎడ్లకి దాణా సిద్ధం చెయ్యి. పాలేళ్ళిద్దరికీ కూడెట్టి పొలం పంపించు. పాకలో చిట్టూతాడూ ఉంది. దాగర్లో కలిపి ఇయ్యి. దూళ్ళకెట్టమను. పాలతప్పేలాలు తోమిపంపించు. పొలం పోతున్నా!" అంటూ నాగలి భుజాన్న వేసుకుని బయలుదేరిన సుబ్బారాయుణ్ణి చూస్తూ నిస్తేజంగా ఉండిపోయింది అపర్ణ.

రేగిన జుట్టూ - గీసిన కందలా ముఖం, మెలేసిన మీసాలూ, ఎర్రజీరల, పెద్దపెద్దకళ్ళూ, బలమైన ఛాతీ, కండలు తేరిన కాళ్ళూ చేతులూ.

లేగదూడ లాంటి తనని, ఈ మొరటు మనిషికిచ్చి, బతుకు బండిని లాగమన్నారు అమ్మానాన్నాను.

అపర్ణ గుండెల్లోంచి దుఃఖం పెల్లుబికి వచ్చింది. ఇంతలో, మెల్లగా పాలరాతి ఊయల ఊహల్లో ఊగింది. కాస్సేపటికి మనస్సు సేదదేరింది. తర్వాత కళ్ళు తుడుచుకొని ఉస్సురంటూ లేచింది.

ముందు పెరట్లో కట్టిన ధాన్యం పురులు, తనని బంధించడానికి లేవదీసిన నాగుబాముల కోటల్లా కనిపించాయి. పెరట్లో పాకలమీద గాలికి లేచిన తాటాకులు, తను ఎక్కడికీ పారిపోకుండా, కాపలాకాస్తూన్న రాక్షసుల జడల్లా కదులుతున్నాయి.

ప్రాణంలేని యంత్రంలా అపర్ణ ఇంటిపనులు మొదలెట్టింది.

చేతులు పనిచేస్తున్నాయి కాని మనస్సునిండా ఆలోచనలే!

ఉండుండి, అందాల ఆ పాలరాతి ఊయల, ఊహల్లో ఊగుతూనే ఉంది.

ఊహలు. ఆలోచనలు. జ్ఞాపకాలు హరివిల్లుల్లాంటి జ్ఞాపకాలు! అపర్ణకి అప్పుడు పట్టుమని పదేళ్లులేవు.

ఆశ్చర్యపోవడానికే తప్ప, కలలు కనడానికి కళ్ళు ఇంకా అలవాటుపడని వయస్సు. ఆ వయస్సులో బైలుదేరింది, అత్తయ్యతో బొంబాయికి. అందులో మొదటిసారి రైలుమీద.

వెనక్కి వెళ్ళిపోతూన్నచెట్లూ, టెలిఫోను స్తంభాలూ – జల్లెడలో జల్లిస్తూన్నట్లు గుండ్రంగా తిరుగుతూ దూరంగా మాయం అయిపోతున్న చేలూ, పంటభూములూ, భూతాల్లా చేరువవుతూన్న పర్వతాలూ, అంతలోనే రైలు పెట్టెని హఠాత్తుగా చీకట్లో ముంచేసే సొరంగాలూ – సొరంగాలు దాటేసరికి ఎత్తుగా ఆకాశంలో ఒకదాన్ని ఒకటి తరుముతూ ఆడుకుంటూన్న తెల్లతెల్లని మబ్బుపిల్లలూ.

అబ్బ! అన్నీ అందాలే! అన్నీ అబ్బురాలే!

ఉన్నచోట ఉండనియ్యడం లేదు అపర్ణని. ఈ కిటికీ దగ్గర్నుంచి ఆకిటికీ దగ్గరికీ, మళ్ళా అక్కడినుంచి ఇక్కడికీ, పరుగులెడుతూనే ఉంది అపర్ణ ఆరైలు పెట్టెలో.

సంతోషంతో కేరింతలు కొడుతూన్న అపర్ణ, బొంబాయి వి.టి. స్టేషన్లో రైలు దిగుతూన్నప్పుడుమాత్రం, భయంతో గజగజా రావి ఆకులా వణికిపోతూ అత్తయ్య చెయ్యిపట్టుకుని ఉండిపోయింది బెదురుచూపుల్తో.

అవును మరి! పన్నెండు ప్లాట్‌ఫారాలూ, వేలాది జనం, లక్షలాది అరుపులూ కేకలూ. అంతమంది జనాన్నీ అంతటి అలజడినీ అపర్ణ ఎప్పుడూ చూడలేదు. మళ్ళీ టాంగామీద ఇంటికి వెళుతూన్నప్పుడు మాత్రమే, ఆమె మనస్సు కుదుటపడింది. తిరిగి కేరింతలూ, చప్పట్లూ. ఎత్తయిన తెల్లమచ్చల బూడిదరంగు గుర్రం – మేనాలా మెరిసిపోతూన్న టాంగా. అపర్ణకి ఆకాశంలో తేలిపోతూ, ఏ స్వర్గలోకాల్లోకో వెళ్ళిపోతున్న ట్లనిపించింది.

పల్లెలో బొంతలేసుకని నేలమీదపడుకున్న వళ్ళేమో, అత్తయ్యగారింట్లో యూఫోమ్ బెడ్‌మీద ఫేను కిందకి చేర్చేసరికి సేద దీరింది. వళ్ళు తెలియని నిద్ర పట్టేసింది అపర్ణకి.

ప్రొద్దున్నే కళ్ళు తెరిచేసరికి, ఎత్తైన ఆగది కిటికీలోంచి, నేలమీదున్న పక్కింటి వాళ్ళతో కాబోలు హిందీలో ఏదో మాట్లాడుతోంది అత్తయ్య. అపర్ణ అత్తయ్య దగ్గరికి వెళ్ళి కిటికీలోంచి కిందకి చూసింది.

అబ్బ! ఎంత అందంగా ఉంది!

ఎర్రని పెద్ద బంగళా. దాని ముందు అంతకి రెట్టింపు పచ్చని పెరడు. పెరడంతా లాన్. లాన్ మధ్యలో నడిచేందుకు తెల్లని రాళ్ళు అతికిన బాటలూ దారులూ. అక్కడక్కడ పువ్వుల కుండీలూ, క్రోటన్ మొక్కలూ.

పెరటికంతటికీ కిరీటంలా మెరిసిపోతూ, స్టాండ్‌కి అమర్చిన ఓ అందమైన పాలరాతి ఊయల!

పాలమీగడలాంటి ఆపాలరాతి ఊయలమీద పచ్చని ఆకుల, ఎర్రని పువ్వుల, నాజూకు పనితనం. తెల్లని వెండి గొలుసులో స్టాండ్‌కి అమర్చిన ఆ పాలరాతి ఊయల, గాలికి కొద్దిగా, అలా, ముందుకీ వెనక్కీ కదులుతూ.

అపర్ణ కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్న కలువలే అయ్యాయి.

అట్లతద్దికి చెరువుగట్టున ఉన్న చెట్లకి మోకులతో కట్టిన ఉయ్యాలల్నే తనింత వరకూ చూసింది.

కాని ఇది పాలరాతి ఊయల!

దేవలోకంలో దేవతలు మాత్రమే ఊగే ఊయల!

"ఎంత బాగుందో ఉయ్యాల!"

అపర్ణ కళ్ళల్లో మెరిసిన కాంతిచూసి అత్తయ్య నవ్వుతూ, "ఏం? ఆ ఉయ్యాల మీద ఊగాలని ఉందా? వెళుదువుగాని. నేను ఆవిడతో మాట్లాడతాను. వాళ్ళు గుజరాతీలు. కోటీశ్వరులు!" అని ఆవిడతో హిందీలో ఏదో చెప్పి, ఇక్కడ నుంచి ఆవిడకి అపర్ణని చూపించింది. ఆవిడ మోహతాబ్ గారిభార్యట. చిరునవ్వుతో అపర్ణని రమ్మని పిలిచింది. కణువు అంచు నీలంరంగు పట్టు పరికిణీ. గులాబీ రంగు ఫ్రాకూ. పొడుగైన జడా. జడలో మల్లెలూ కనకాంబరాలూ కలిపికట్టిన కదంబం. జడచివర జడగంటలూ. కాళ్ళకి వెండి మువ్వలగజ్జెలు.

నూటికి నూరుపాళ్ళూ తెలుగు పల్లె అందాలు!

ఆలయంలోంచి పసిడి విగ్రహం తమ లాన్‌లోకి నడిచి వస్తోందా అనిపించింది, మెహతాబ్ భార్యకి. పరిగెట్టుకుంటూ ఎదురువచ్చి, అపర్ణ బుగ్గలూ గడ్డం పుణికి ముద్దెట్టుకుని, ఊయల దగ్గరికి నడిపించుకు వెళుతూ, "కిశోర్" అని కేకేసింది.

పధ్నాలుగేళ్ళ కుర్రాడు!

పట్టుకుచ్చులాంటి జుట్టూ. వెలుగులు చిమ్ముతూన్న పెద్దపెద్దకళ్ళూ. అరిందాలా గంభీరంగా ఉన్న ముఖం. పాలమీగడలో బంగారు రజం మెదిపి చేసినట్లుంది వళ్ళు. తెల్లని సిల్కు లాల్చీ పైజమా వేసుకు వచ్చిన రాజకుమారుడిలా, బామ్మ చెప్పే కాశీమజిలీకథల్లో, దేవలోకం నుంచి కీలుగుర్రం మీద భూలోకంలోకి దిగివచ్చే గంధర్వ కుమారుడిలా కనిపించాడు అతను అపర్ణకళ్ళకి. జిగేల్ మన్న కళ్ళని ఓ మారు మూసుకుని మళ్ళీ తెరిచి చూసింది.

కిశోర్ కూడా అపర్ణని కన్నార్పకుండా చూస్తున్నాడు.

ఇద్దరి మనస్సులూ పువ్వుల మీద గెంతే, సీతాకోక చిలుకలయ్యాయి.

జాజి పువ్వుల్లోంచి దూసుకెళుతూ గుసగుసలాడే మలయమారుతాలయ్యాయి. తడిసిన తామరపూవుల రేకులమీద ఆటలాడే వెన్నెల కాంతులయ్యాయి.

మెహతాబ్ భార్య, కొడుకు కిశోర్‌కి, హిందీలో ఏదో చెప్పి, అపర్ణ బుగ్గల్ని మరో మాటు ముద్దెట్టుకుని, బంగళాలోకి వెళ్ళిపోయింది.

ఇంక, ఆ అందాల పూదోటలో అపర్ణా, కిశోర్ ఇద్దరే మిగిలారు. ఎదురుగుండా గాలికి సుతారంగా కదులుతూన్న పాలరాతి ఊయల.

కిశోర్ చిన్నగానవ్వాడు. వెన్నెల కిరణం తళుక్కుమంది. కలువరేకుల్లాంటి అపర్ణ రెండు పెదాలూ ఎర్రగా విచ్చుకున్నాయి.

ఇద్దరి ముఖాలమీదా, విరిసిన చిరునవ్వే వాళ్ళభాష. అతనికి తెలుగురాదు. ఆమెకి హిందీ తెలియదు. కళ్ళతోటీ చేతులతోటే సంజ్ఞచేశాడు, "ఊయలమీద కూచో. ఊపు ... తాను" – అని.

పట్టలేని సంతోషంతో ఊయలదగ్గరికి పరిగెట్టింది.

కాని, తను చట్టున ఎక్కి కూచోడానికి వీలుగాలేదు.

గుప్పెడు కిందకి ఉంటే బాగుండును. అపర్ణ పడుతూన్న ఇబ్బంది చూసి, చెయ్యి సాయంచేశాడు కిశోర్.

అతని చెయ్యి అపర్ణచేతికి తగిలినప్పుడు వెన్నెలకిరణం వచ్చితాకినట్లు వళ్ళు ఝల్లుమంది.

సిగ్గూ – భయం – ఇబ్బందీ – ఇష్టం.

బాధ అనిపించినా, బాగానే ఉంది అపర్ణకి.

వెన్నెల పాలరాతి ఊయాలమీద తను కూర్చుంటే, నేలమీద నిలబడి కిశోర్ సుతారంగా ఊయల్ని ఊపుతూంటే, గాలిలో తేలిపోతూన్న మబ్బుతునకే అయింది అపర్ణ. వెన్నెట్లో కదులుతూన్న చిరుకెరటం అయింది. పూలపరిమళం సోకి సోలిపోయే గాలిబాల అయింది.

అలలా – గాలిలా – హాయిగా – మెత్తగా.

కదులుతూన్న ఊయల – కరిగిపోతూన్న అపర్ణ.

ఊయల మరికాస్త వేగంగా, గాలికి ఎత్తుగా ఊగినప్పుడు, అపర్ణ భయంతో అరవబోయేది. కాని అంతలోనే కలకలా నవ్వేసేది. కిశోర్ కూడా నవ్వేవాడు.

ఆమె నవ్వితే గులాబీ పువ్వులిచ్చుకున్నట్లూ.

అతను నవ్వితే మల్లెలపొట్లం విప్పినట్లూ.

ఒకటే నవ్వులు.

వాళ్ళ నవ్వుల్ని చూసి మెహతాబ్ భార్య ఏం అందో ఏమో, అత్తయ్య ఓ మారు తన బుగ్గమీద చిటికేసి "ఏవే! ఆవిడ నిన్ను తన కోడల్ని చేసుకుంటుందట! సరేనా?" అన్నప్పుడు అపర్ణకి ఎక్కడలేని సిగ్గూ ముంచుకొచ్చేసింది.

అపర్ణ చిన్నారి ఊహలు అదిగో, అప్పుడు రెక్కలు తొడిగాయి.

మొదటి సారిగా, కళ్ళు కలలు కనడం ప్రారంభించాయి.

మనస్సులో పాలరాతిఊయల సుతారంగా ఊగింది.

ఆ తర్వాత కిశోర్‌తో కలిసి పకపకా నవ్వలేకపోయింది.

అతను గలగలా నవ్వినా, తను చిరునవ్వే నవ్వేది.

సిగ్గుపడేది.

అలా ఊయలపై ఊగుతూ – ఊహల్లో తేలుతూ – ఆలోచనల హరివిల్లుమీద ఆకాశంలో అడుగులెడుతూ ఏ నెలా నెలాపదిహేనురోజులు ఆనందించిందో – అంతే.

అమ్మ దగ్గర్నుంచి కబురు వచ్చింది.

బొంబాయి నుంచి తిరిగి పల్లెకి వచ్చేసింది అపర్ణ.

ఇంటి పనుల్లో అమ్మకి సాయం చెయ్యడం, తన ఈడు పిల్లలతో ఆడుకోవడం, పెద్ద ఆరిందాలా మారడం, పెళ్ళికావడం అన్నీ క్రమంగా జరిగిపోయాయి.

మనస్సులోంచి పాలరాతి ఊయలమాత్రం చెరిగిపోలేదు. ఉండుండి చల్లగా మెల్లగా ఊగుతూనే ఉంది.

ఊహలూ –ఆలోచనలూ – జ్ఞాపకాలూ సాగుతూనే ఉన్నాయి, కాపురానికి వచ్చిన కొత్తలోనూ, ఆతర్వాతా కూడా.

ఇప్పుడు అపర్ణ కొత్తగా కాపురానికి వచ్చిన చిన్న పిల్లకాదు.

సుబ్బారాయుడితో నలభైయేళ్ళు కాపురంచేసి ఏభయ్యో పడి దాటుతూన్న ఆరిందా.

ఆ పల్లెటూరి కాపురంలో, క్షణం తీరిక ఉండదు. లంకంత కొంప. బండెడు చాకిరీ. ఇద్దరు దాసీలూ ముగ్గురు పాలేళ్ళూ. పాతికెకరాల వ్యవసాయం. ధాన్యం, మినుములూ, పెసలూ. గంపల్లో గాదుల్లో భద్రపరచుకోవడం. నాలుగు గేదెలపాడి.

కొడుకులూ – కూతుళ్ళూ – పెళ్ళిళ్ళూ – బారసాలలూ – వచ్చేపోయే చుట్టాలూ.

"అలా కూర్చుంటే ఎలా? ఏవిటా పరధ్యానం మాటిమాటికీ? లే! లేచి పని చూడు!" అంటూ సుబ్బారాయుడు వేసే కేకలూ అరుపులూ.

ప్రతీదీ ఖచ్చితంగా జరగాలాంటాడు.

ఓ ఆదరణా, ఆత్మీయతా, లాలనా, చిరునవ్వూ ఏంలేదు. నాగరికతా సంస్కారం లేకపోగా, విసుగూ, కోపం ఒకటే.

అలాంటి భర్తతో కాపురం.

ఇంక అపర్ణకి పులకింతా అనుభూతీ ఏ వుంటాయి?

భారంగా బ్రతుకు నడుస్తూఉన్నా మధ్యమధ్య ఉన్నట్టుండి మనస్సులో పాలరాతి ఊయల ఊగుతూనే ఉంది. అందుకే మనస్సుకి కాస్త ఉత్సాహం, ఊరటా – మళ్ళీ అంతలోనే నిరుత్సాహం, నిట్టూర్పూ.

నాటి అపర్ణ బంగారు బొమ్మ! కలల లోకంలో రంగుల హరివిల్లు మీద హాయిగా విహరిస్తూ, పాలరాతి ఊయల మీద పరవశిస్తూఊగే అందాల సుందరి.

నేటి అపర్ణ అలా కాదు. బరువైన అనుభవాలతో, భారమైన బాధ్యతలతో,

కన్నకలలన్నీ క్రమంగా వెలిసిపోతూ, తలకూడా అక్కడక్కడ నెరిసిపోతూ, రోజురోజుకీ అలిసిపోతూన్న దొడ్డఇల్లాలు.

సున్నితమైన అపర్ణ హృదయంమీద జీవితం ఎన్నో సమ్మెట దెబ్బలు వేసింది. చల్లనిమాటా, చక్కని చూపూ తెలియని మొరటు భర్తతో, జీవితంలో మిగిలిన కాస్త మాధుర్యంకూడా ఇంకిపోసాగింది.

ఉన్నట్టుండి మనస్సులో, అలనాటి పాలరాతి ఊయల మాత్రం, లీలగా, మెల్లగా ఊగుతూ ఉంటుంది. అదేనా ఒక్కక్షణమో. ఒక్క నిముషమో.

ఆక్షణమే అపర్ణ ఎడారి జీవితంలో ఒయాసిస్సు.

చీకటి బ్రతుకులో చిరుదీపం!

"అలా చీకట్లో కూర్చున్నావేమిటి? లేచి, దీపం వెలిగించు. ఇదిగో బొంబాయి నుంచి మీ అత్తయ్యట! ఉత్తరం రాసింది. మంచంమీంచి లేవడం లేదట! ముసలి తనంలో వెళ్ళిపోయేముందు నిన్నోసారి చూడాలని ఉందట. వీలైతే పంపించమంది. వెళ్తావా?"

సుబ్బారాయుడి గొంతులో కాఠిన్యం, అధికారమే, కాని ఆర్ద్రత లేదు.

"వెళ్ళేదేవిటిలెండి!" అంది అపర్ణ నిరాశగా.

"ఎందుకా నిట్టూర్పులు! .... వెళితే వెళ్ళు ..... నాలుగు రోజులు ఉండి వస్తే కాస్త చైతన్యమేనా వస్తుంది మనిషిలో. నలభై ఏళ్ళ కాపురంలో చురుకూ ఉత్సాహం ఏదీ లేదు. ఎప్పుడూ ఏదో ఒక పరధ్యానం, మతిమరుపూ – జీవితంలో అదృష్టాన్ని దేన్నో కోల్పోయినట్లు!"

సుబ్బారాయుడి మాట తీరే అంత.

ఓ అనురాగమా, ఓ ఆత్మీయతా?

అపర్ణ ఏం మాట్లాడలేదు.

"మీ అత్తయ్యంటే నీకెంత ప్రేమో నాకు తెలుసు. ఆవిడా నీ కోసం బెంగ పెట్టుకునే ఉంటుంది. పెద్దదైంది పైగా. నిజంగానే చెప్తున్నా. టిక్కెట్టు కొనిస్తా వెళ్ళు. కానయితే పది పదిహేను రోజుల్లో వచ్చెయ్యి. అంతకంటే ఆలశ్యం చేస్తే, కోడలు చూసుకోలేదు. లంకంత ఇల్లూ లక్షబాధ్యతలూను. నువ్వు కనక నెట్టుకొస్తున్నావు"

మొదటి సారిగా భర్తగొంతులో ఆర్ద్రతా, ఆప్యాయతా ఆత్మీయతా.

ఆశ్చర్యంతో చూసింది అపర్ణ....

బొంబాయిలో, ఎనభైయేళ్ళు దాటిన అత్తయ్య పక్కలో కూర్చుని వెన్ను రాస్తూన్న అపర్ణ చెయ్యి హఠాత్తుగా ఆగిపోయింది.

"ఏమైంది?" అన్నట్లు ఆవిడ వెనక్కి తిరిగి అపర్ణకేసి చూసింది.

అపర్ణ గాజు కిటికీలోంచి కిందకి చూస్తూ కనిపించింది.

"ఏవిటే. అటు చూస్తున్నావు?"

"అహ ... అది కాదు ..... అక్కడ మెహతాబ్ గారి బంగళా .... లానూ ... పూలమొక్కలూ ... పాలరాతి ఊయలా ... అవన్నీ ...!"

"అవా? అవెప్పుడో పోయాయి. ఎప్పటి మెహతాబ్! ఎప్పటి బంగళా ముప్పయి ఏళ్ళ సంగతి!"

"ఆ పిచ్చి మొక్కలేవిటి? ... ఆరేకుల షెడ్లూ, షెడ్ల ముందు గుట్టలుగా పోసిన ఆ పాత ఇనపసామాన్లూ ..... ఏవిటిదంతా. నా చిన్నప్పుడు ఎంత అందంగా ఉండేవీ, ఆ లానూ, ఆ ఊయలా, అవన్నీ! ఏవీ? ఏమైందీ?"

"ఏముంది? తండ్రిపోయి, ఆస్థి కంతకీ అధికారి అయ్యాక ఆ కిశోర్ లేడూ, వాడు, తన యిష్టం వచ్చినట్లు ఉండసాగాడు. గుర్ర పుందేలు - రాత్రీ పగలూ తాగడం - అడ్డమైన ఆడవాళ్ళనీ ఇంటికి తీసుకురావడం - ఇంటిని ఒకపానశాల గానూ వ్యభిచార గృహంగానూ మార్చేశాడు.

తల్లి చెప్పి చెప్పి చివరికి సింహద్వారానికి ఉరిపోసుకుని చచ్చిపోయింది.

అడ్డుకొనే తల్లికూడా లేదేమో, నాలుగైదేళ్ళలో ఆస్థినంతనీ హారతి కర్పూరం చేసేశాడు కిశోర్. అప్పులవాళ్ళు ఆస్థిని స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగళానీ స్థలాన్నీ మాత్రం పాత ఇనుప సామానువ్యాపారి ప్రతాప్‌సింగ్ వేలం పాటలో కొన్నాడు."

అత్తయ్య చెబుతూన్న ఒక్కొక్క సంగతీ అపర్ణ గుండెల మీద సమ్మెట పోటులా పడుతోంది.

నలభై ఏళ్ళ నుంచి తను భద్రంగా గుండెల్లో దాచుకొన్న కల. చుట్టూ చీకట్లు ముసురుకున్నప్పుడల్లా తటిల్లతలా మెరిసి, తన మనస్సుకి ఊరట కలిగించే, రంగు రంగుల వెలుగుచిత్రం....

ఇప్పుడీ పిచ్చి మొక్కలుగా ... ఇనుప సామాను గుట్టలుగా .....

గుండె చేత్తో పట్టుకునిమరీ వింటోంది అపర్ణ.

"బంగళాని వేలం పాటలో, పాడేసినా వచ్చి పూర్తిగా ఆక్రమించుకోలేదు ప్రతాప్‌సింగ్ ... పోనీ బ్రతికి చెడ్డవాడుకదా అన్న జాలితో, కిశోర్‌ని ఓగదిలో ఉండ నిచ్చాడు.

ఎక్కడో తాగివచ్చి, ఆపాలరాతి ఉయ్యాలామీద పడిఉండేవాడు కిశోర్".

అపర్ణ హృదయం చిల్లులు పడుతోంది.

ఎలాంటి కిశోర్! ఎలా అయిపోయాడు!

పంచకళ్యాణి గుర్రంమీద ప్రేయసితో కలిసి మేఘాల్లో విహరించాల్సిన రాజకుమారుడు!

"ఓ రోజున, తాగిన మత్తులో వచ్చి ప్రతాప్‌సింగ్ కూతుర్ని ఆక్రమించుకొని అత్యాచారం చెయ్యబోయాడు కిశోర్! కూతురు అరుపులు విని ఇంట్లోంచి బయటికి వచ్చాడు ప్రతాప్‌సింగ్ .....

పాలరాతి ఊయ్యాలమీద పెనుగులాడుతూన్న కూతురూ, ఆమెని స్వాధీనం చేసుకోడానికి రాక్షసుడిలా ప్రయత్నిస్తూన్న కిశోర్!

ప్రతాప్‌సింగ్ ప్రళయరుద్రుడే అయ్యాడు.

కర్రతీసుకువచ్చాడు. ఆమె అరుపులు విని అప్పటికే చుట్టుపక్కల వాళ్ళు ఐదారుగురు పోగయ్యారు. అంతా కలిసి కర్రలతో కిశోర్‌ని కుక్కని బాదినట్లు బాదారు. ఆదెబ్బలకి రక్తం మడుగులో ఒరిగిపోయి, ఆ ఉయ్యాలమీద ఆమట్టునేపడి ప్రాణం వదిలేశాడు కిశోర్!"

అపర్ణ కెవ్వున కేకపెట్టింది.

అత్తయ్య కంగారుపడి, "ఏవిటే! ఏమైందీ?" అని అడిగింది.

నిర్జీవంగా చదిగిలపడిపోయిన, కన్నీరుకారుస్తూన్న అపర్ణని కుదిపికుదిపి మరీ అడిగింది, "ఎందుకలా అరిచావు?" అని.

అపర్ణ ఒక్కమారు ఉలిక్కిపడి ఈలోకంలోకి వచ్చింది. గుడ్లప్పగించి అత్తయ్య కేసి నిర్లిప్తంగా చూసింది. తర్వాత "ఏం లేదు..." అంటూ పైట చెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ఆ మర్నాడు –

"నెల్లాళ్ళు ఉంటానని వచ్చావు కదా. నిన్న మీ ఆయనకి టెలిగ్రాం ఇవ్వడం ఏవిటి? ఇవాళ ఇలా బయలు దేరడం ఏవిటి? వెళ్ళొచ్చులే, స్థిమితంగా" అంది అత్తయ్య.

"కాదు ..... ఆయనకి రేపు స్టేషన్‌కి బండిపంపమని టెలిగ్రాం ఇచ్చాను. ఇవాళ వెళ్ళాలి. తప్పదు" అంటూ, అత్తయ్య ఎంత బతిమాలుతూఉన్నా వినకుండా బయలుదేరింది అపర్ణ.

రైల్లో ప్రయాణం చేస్తోందే కాని, ఒకటే ఉలిక్కిపడడం. రక్తం మడుగులో పడిపోయిన కిశోర్‌ని ఊహించుకొని, ఉండుండి కన్నీళ్ళు పెట్టుకోవడం.

హంసలా గాలిలో ఊగాల్సిన పాలరాతి ఊయల, రక్తంలో తడిసి, గొలుసులు తెగి, నేలమీద విరిగి ముక్కలైపోయిన దృశ్యాన్ని తలుచుకొని మాటిమాటికీ ఉలిక్కి పడడం.

రైలు ఆగింది.

ప్లాట్‌ఫారమ్ మీద మొరటుగా, బలంగా, గంభీరంగా కనిపించాడు సుబ్బారాయుడు.

బండి ఇచ్చి ఎవర్నో పంపించకుండా, తనేవచ్చారన్నమాట స్టేషన్‌కి.

హమ్మయ్య. అనుకుంది అపర్ణ.

కలల లోకంనుచి కిందకి పడిపోతూన్న తనని పొదివి పట్టుకుని రక్షించేందుకు, కండలు తిరిగిన ఆయన చేతులున్నాయి. అవి చాలు తనకి.

మేఘాల అంచులమీదకీ, రంగుల హరివిల్లుపైకీ, తనని ఆయన ఎప్పుడూ తీసికెళ్ళలేదు. ఎప్పుడూ పాడీ, పంటా, బంధువులూ, బాధ్యతలూ, జంజాటనా - ఇదే తనకి ఆయన ఒరగబెట్టిన బ్రతుకు.

మళ్ళీ ఆ బ్రతుకులోకి లాక్కుని తీసుకపోడానికి స్వయంగా బండికట్టుకుని మరీ వచ్చారు స్టేషన్‌కి.

"హుఁ!" అని ఒక నిట్టూర్పు విడిచింది.

"వంద లంఖణాలు చేసినట్లు ఇలా అయిపోయావేమిటి?" అన్నాడు సుబ్బారాయుడు, ఆమె చేతిలో పెట్టె అందుకుంటూ.

ప్రాణంలేని చిరునవ్వు, ఆమె పెదాలమీద.

దానికే ప్రాణప్రతిష్ఠచేసి, వెలుగుకిరణంలాంటి చూపు ఒకటి భర్తవైపున విసిరి, చటుక్కున అతని బలమైన చెయ్యిపట్టుకుంది అపర్ణ.

"పిచ్చిదానా! నెల్లాళ్ళుంటానని వెళ్ళినదానివి నాలుగు రోజులకే నాకోసం బెంగపెట్టుకుని వచ్చేశావా?" అనడిగాడు.

అపర్ణ అవును అనాలేదు, కాదు అనాలేదు. రెండింటికీ అర్థం వచ్చేలా లేదా అర్థమూ రానట్లుగా – తల అడ్డంగా కాకుండా, నిలువుగా ఊపింది.

భర్త చెయ్యిసాయంతో సవారీబండి ఎక్కింది. సుబ్బారాయుడు ఎడ్లని అదిలించాడు.

వాటి మెడలో మువ్వలు ఘల్లుమన్నాయి. అపర్ణ హృదయం కూడా ఝల్లుమంది.

మేఘాల్లో తేలుతూన్నట్లు ఊగేఉయ్యాలకీ, నేలమీద నడిచే బండికీ ఎంత తేడా! బండిలో వెళుతూన్నప్పుడు భారంగా నిట్టూర్చి, భర్త బుజంమీద తల ఆన్చింది అపర్ణ. 'పిచ్చిదానా!' అంటూ ఆప్యాయంగా తలనిమిరాడు సుబ్బారాయుడు.

అంతే! –

తర్వాత అపర్ణ ఊహల్లో, ఎప్పుడూ ఊయల ఊగలేదు. ఆగిపోయింది. మువ్వల బండిలా బ్రతుకుమాత్రం ముందుకు సాఫీగా సాగిపోయింది.

(స్వాతి, ఫిబ్రవరి 2002)

*